క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సదుంలో మానవ హారం ఏర్పాటు చేసిన విద్యార్థులు

సదుం: ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో హరిబాబు సూచించారు. ఆయన శుక్రవారం సదుంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో మానవ హారం ఏర్పాటు చేశారు. మత్తుపదార్థాల వినియోగం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని, జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. హెచ్‌ఎం సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

15 వరకు బ్యాంకింగ్ సేవలు ఉండవు

గంగవరం: రాష్ట్రంలో నాలుగు గ్రామీణ బ్యాంకులు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పడిన సందర్భంగా ఈ నెల 15వ తేదీ వరకు సప్తగిరి గ్రామీణ బ్యాంక్ గంగవరం బ్రాంచ్‌లో ఎలాంటి సేవలు జరగవని బ్యాంక్ మేనేజర్ కృపానంద్ తెలిపారు. భారత ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, గ్రామీణ వికాశ్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఈ నాలుగు గ్రామీణ బ్యాంకులు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా ఏర్పడినట్టు పేర్కొన్నారు. బ్యాంకుల విలీనం సందర్భంగా కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ అనుసంధానంలో జరిగే సాంకేతిక ప్రక్రియ కారణంగా 15వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆర్థికపరమైన బ్యాంకింగ్ సేవలు, అన్ని ఆన్‌లైన్ లావాదేవీలు జరగవని తెలిపారు. ఖాతాదారులు సహకరించాలని కోరారు.

పాట్టెంవారిపల్లెలో వైద్య శిబిరం



సదుం: వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

సదుం: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి తెలిపారు. మండలంలోని పాట్టెంవారిపల్లెలో శుక్రవారం పీపుల్ గ్రోవ్ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ వైద్య శిబిరంలో మదనపల్లెకు చెందిన స్వాస్థ్య ఆస్పత్రి వైద్యులు సుమారు వంద మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ రెడ్డి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన మిలాదున్ నబీ వేడుకలు

పుంగనూరు: పట్టణంలో నిర్వహిస్తున్న మిలాద్-ఉన్-నబీ వేడుకలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ముస్లింలు కుమ్మరవీధి మకాన్ వద్ద ప్రవక్త పేరు మీద ప్రార్థనలు చేశారు. అలాగే ప్రత్యేక నమాజ్ చేశారు. మత గురువులు ప్రవక్త బోధనలను వివరించారు.

16న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

శాంతిపురం: ఈ నెల 16న మండల స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ శివయ్య తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మండల, పంచాయతీ స్థాయి అధికారులు విధిగా పాల్గొనాలని తెలిపారు. వివిధ దళిత సంఘాల ప్రతినిధులు హాజరై తమ సమస్యలను తెలపాలని కోరారు.

హాస్టల్ భవనాలకు స్థలాలు చూపించండి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

పలమనేరు: హాస్టల్ భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను వెంటనే చూపి పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తహసీల్దార్ ఇన్బునాథన్, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని ఆదేశించారు. ఆయన శుక్రవారం అధికారులతో మాట్లాడారు. స్థానికంగా జూనియర్ కళాశాల బాలురు, బాలికల హాస్టళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక వైపు బాలికలకు, డిగ్రీ కళాశాల వెనుకవైపు బాలురకు స్థలాన్ని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ సురేష్‌రెడ్డి, ఏఈ స్నేహప్రియ, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామ సరిహద్దు అభివృద్ధికి అడ్డు



మున్సిపాలిటీ, పంచాయతీకి మధ్య సరిహద్దుగా ఉన్న రాజకాలువ

- మున్సిపాలిటీ, పంచాయతీ మధ్య నలుగుతున్న జనం
- దశాబ్దకాలంగా బోయవీధిలో తెగని సమస్య
- ఓట్లు మున్సిపాలిటీలో.. పన్నులు పంచాయతీకి

పలమనేరు మున్సిపాలిటీ, గంగవరం పంచాయతీకి మధ్యనున్న బోయవీధి సరిహద్దు కారణంగా దశాబ్దకాలంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఓట్లు మున్సిపాలిటీలో వున్నాయి. ప్రజలు ఇంటి పన్నులను మాత్రం గంగవరం పంచాయతీకి చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో అభివృద్ధి పనులను ఎవరూ చేపట్టడం లేదు. పంచాయతీకి పన్నులు చెల్లిస్తున్నారు కాబట్టి వారు పనులు చేయాలని మున్సిపాలిటీ అధికారులు చెబుతున్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకుని తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని బోయవీధి వాసులు కోరుతున్నారు.

పలమనేరు: పలమనేరు పట్టణంలోని బోయవీధి ప్రాంతం మున్సిపాలిటీకి సరిహద్దుగా ఉంది. ఇక్కడుండే రాజకాల్వ అటు గంగవరం రెవెన్యూకు, ఇటు పలమనేరు పట్టణ రెవెన్యూను విడదీస్తుంది. పట్టణం మున్సిపాలిటీగా రూపాంతరం చెందేనాటికే రెండు రెవెన్యూల మధ్య ఇంటి నిర్మాణాలు జరిగాయి. ప్రస్తుతం సమస్యాత్మకంగా ఉన్న బోయవీధిలో దాదాపు వంద కుటుంబాల వారు కాపురముంటున్నారు. వీరు పట్టణంలోనే ఓటు హక్కును కలిగి ఉన్నారు. రేషన్ కార్డులు అక్కడే ఉన్నాయి. కరెంటు బిల్లులు పలమనేరుకే ఉన్నాయి. ఇంటి పన్ను మాత్రం పంచాయతీకి చెల్లిస్తున్నారు. ఫలితంగా మున్సిపాలిటీలో చేసే పనులను సరిహద్దుల మేరకే సాగుతోంది. కొన్ని వీధుల్లో సీసీ రోడ్లను సైతం సగానికి వేసి వదిలేశారు. తాగునీటి ట్యాంకును మున్సిపల్ అధికారులు నిర్మించారు. దానికి సంబంధించిన మోటారు గంగవరం రెవెన్యూలో ఉంది. నీటి సరఫరా విషయంలోనూ సమస్యలు తప్పడం లేదు.

మున్సిపాలిటీ విస్తరణ ఆలస్యమే కారణం

గతంలో మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు ఉన్నప్పుడు ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిని మండల కేంద్రమైన గంగవరం, టీఎస్ వడ్డూరు, క్యాటిల్‌ఫామ్ వరకు విస్తరింపజేసేందుకు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు ప్రతిపాదనలు పంపారు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు సైతం వచ్చాయి. వాటిని అమలుచేయకపోవడంతో సమస్యగా మారింది. దశాబ్ద కాలంగా ఈ సమస్య ఇలాగే వుంది. తమ సమస్యను పరిష్కరించాలంటూ ఈ ప్రాంతవాసులు గతంలో అధికారులకు విన్నవించారు. రాజకీయ కారణాలతో ఈ పనులు అటకెక్కాయి. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పలమనేరు సరిహద్దులు చూపే మ్యాప్

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

రొంపిచెర్ల: మండలంలోని పెద్దగొట్టిగల్లు ఎంవీఆర్ కల్యాణ మండపంలో శనివారం మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ కరీముల్లా తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల ఏర్పాటుపై చర్చ వుంటుందని తెలిపారు. ఇందులో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పాల్గొంటారని, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ అశ్విని

కుప్పం: మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ అశ్విని అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజల సమస్యలను సత్వరం పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా అందేలా చూడాలన్నారు. అధికారులు పార్టీలతో సంబంధం లేకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శరవణ, ఎంపీడీవో, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

మేమింతే.. మారము అంతే

- చారాల సచివాలయంలో కొరవడిన సమయపాలన
- సచివాలయం ఎదుట వీఆర్వో పడిగాపులు



చారాల సచివాలయం బయట వేచి ఉన్న వీఆర్వో శ్రీనివాసులు (ఫైల్)

చౌడేపల్లె: మండలంలోని చారాల సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినా ఫలితం లేదు. ప్రతిరోజూ ఉదయం 11 గంటలైనా విధులకు రావడం లేదు. కనీసం సచివాలయం తాళాలు సైతం తీయడం లేదు. గురువారం ఉదయం 10.30 గంటలకు విధులకు హాజరైన వీఆర్వో శ్రీనివాసులు సుమారు గంట వరకు పడిగాపులు కాశారు. అప్పటికీ వారు రాకపోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిపోయారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు సైతం నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి ఓంప్రసాద్ వివరణ ఇస్తూ వర్షం కారణంగా ఆలస్యంగా తాళాలు తీశామని తెలిపారు. ఇది పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



పులిచెర్లలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): ప్రతిఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి వుండాలని పులిచెర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ యువ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ భావి తరాలు హెచ్ఐవీ బారిన పడకుండా చూడాలన్నారు. మహిళలు గర్భం దాల్చిన వెంటనే ఎయిడ్స్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ అపర్ణ, సిబ్బంది శ్రీదేవి, పురుషోత్తం, చంద్రయ్య, ప్రమీల, తులసి, సుభాషిని పాల్గొన్నారు.


స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ యూత్ విభాగం నాయకులు

పలమనేరు: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచే అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ ముజ్జు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ యువత సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువకులకు ఒరిగిందేమీ లేదన్నారు. నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత వైఎస్సార్ సీపీ గెలుపుకోసం నడుంబిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సుబ్రమణ్యం నాయుడు, పట్టణ యూత్ ప్రెసిడెంట్ రాజేష్‌నాయుడు, వైస్ ప్రెసిడెంట్ మహబూబ్‌బాషా, యూత్‌వింగ్ నేతలు పాల్గొన్నారు.

భక్తితోనే ముక్తి



భక్తులను ఆశీర్వదిస్తున్న స్వామీజీ

పుంగనూరు: భక్తితో ముక్తిని పొందవచ్చని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకుని భక్తిభావాన్ని కలిగి వుండాలని హరిహరపురం మఠాధిపతి స్వయంప్రకాశానంద సచ్చిదానంద సరస్వతి మహాస్వామి తెలిపారు. పట్టణంలోని హరహరమఠం ఆరాధన ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో శాంతి నశిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్లో స్వార్థం పెరిగిపోయిందన్నారు. అందరూ భగవంతునిపై దృష్టి సారించాలని, విద్వేషాలకు దూరంగా ఉండాలని బోధించారు. భక్తులకు ఆశీస్సులు అందించారు.

సబ్సిడీతో జొన్న, మొక్కజొన్న విత్తనాలు

పులిచెర్ల(కల్లూరు): మండలానికి 9 టన్నుల జొన్న, మొక్కజొన్న విత్తనాలు వచ్చాయని పులిచెర్ల మండల పశువైద్యాధికారి సయ్యద్ బాషా తెలిపారు. వాటిని మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో పొందవచ్చని తెలిపారు. జొన్నలు 5 కేజీల బ్యాగు సబ్సిడీ 75 శాతం పోను రూ.115లను రైతులు చెల్లించాలన్నారు. కావలసిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డుతో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి



తేజష్ (ఫైల్)

బైరెడ్డిపల్లె: మండలంలోని జాలారిండ్లు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కుమారుడు తేజష్(11) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. తేజష్ పెద్దవల్లారగుంట ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేదు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. విద్యార్థి కుటుంబ సభ్యులకు రూ.6 వేలు అందజేశారు.

జీఎస్టీ తగ్గింపుపై హర్షం

వి.కోట: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జీఎస్టీని సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం హర్షించదగిన విషయమని బీజేపీ నాయకులు తెలిపారు. వారు శుక్రవారం వి.కోటలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకుని జీఎస్టీ తగ్గించినట్టు తెలిపారు. దీంతో నిత్యావసర సరుకుల ధరలు, ఇళ్ల నిర్మాణ ఖర్చులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రుడు, నాయకులు రాజసింహ, శివ, గోపినాథ్, కష్ణ, రవికుమార్,పార్థసారధి,సతీష్,సునీల్, ఆంజనేయప్ప పాల్గొన్నారు.

మృతురాలికి నివాళి



సుబ్బమ్మ మృతదేహంపై పూలమాలలు వేస్తున్న అమరనాథ్

వి.కోట: పట్టణంలోని ఈశ్వర్‌నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అమరనాథ్ తల్లి సుబ్బమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తనయుడు అమరనాథ్ గ్రామానికి చేరుకుని మృతురాలి భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సురేష్ మోహన్, అంబరీష్ బాబు ఉన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



బయ్యప్పగారిపల్లి పంచాయతీ వైఎస్సార్‌సీపీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

పలమనేరు: రానున్న పంచాయతీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి చుక్కలు చూపిస్తూ వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవడమే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం బయ్యప్పగారిపల్లి పంచాయతీలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ దఫా ఎన్నికలు ముందుగానే వస్తున్నాయని తెలిపారు. ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించాలని సూచించారు. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ కూటమికి దెబ్బకొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పంచాయతీ ప్రెసిడెంట్ కే గోవిందస్వామి నాయుడు, యూత్ ప్రెసిడెంట్ ఆనంద, రైతు నాయకులు దేవరాజులు, మహిళా నాయకురాలు కోటేశ్వరి, చెంగారెడ్డి, స్థానిక సర్పంచ్ ఎర్రయ్యబుజ్జి, ఎంపీటీసీ రమేష్, మాజీ సర్పంచ్‌లు అయ్యాకన్ను, హరిక్రిష్ణ పాల్గొన్నారు.

యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు



రామకుప్పం మండలం గోవిందపల్లి గ్రామంలో యూరియా కోసం తిప్పలు

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. నిత్యం రైతులు రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాలు చుట్టూ తిరుగుతూ వున్నారు. రామకుప్పం మండలం గోవిందపల్లిలో శుక్రవారం యూరియా కోసం రైతులు అవస్థలు పడ్డారు. గంటల తరబడి క్యూలో నిలబడి ఒక బస్తా యూరియా కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోయారు.

వర్క్ ఫ్రం హోమ్‌కు 4,350 మంది నమోదు



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

శాంతిపురం: మండలంలోని 4,350 మంది ఔత్సాహిక అభ్యర్థులు వర్క్ ఫ్రం హోమ్ కోసం దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం మఠం గ్రామ సచివాలయంలో పేర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 10వ తరగతి, ఆపై విద్యార్హతలు కలిగిన వారు వర్క్ ఫ్రం హోమ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకున్న వారిలో 2,759 మంది మాత్రమే తమ ధ్రువీకరణ పత్రాలను సచివాలయ సిబ్బందికి అందజేసినట్టు తెలిపారు. మిగిలిన వారు వెంటనే ఇవ్వాలని కోరారు. ఆసక్తిగల వారు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మురళి, పంచాయతీ కార్యదర్శి గౌస్ బాషా పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో నిర్లక్ష్యం వద్దు

పుంగనూరు: రైతులకు యూరియాలో పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సీపీఐ కార్యదర్శి వెంకటరమణారెడ్డి కోరారు. ఆయన శుక్రవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక గోకుల్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ యూరియా తగినంత లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మొద్దునిద్ర వీడి తగినంత యూరియా అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామమూర్తి, మున్నా పాల్గొన్నారు.

నీటి నాణ్యతా పరీక్షలు గాలికి!

గ్రామాల్లో ప్రజలకు సరఫరా చేసే మంచినీరు శుద్ధంగా ఉందా లేదా అని చూసే నాథుడు లేకుండా పోయాడు. ట్యాంకులను శుభ్రం చేయడం లేదు. క్లోరినేషన్ గురించి పట్టించుకోవడం లేదు. పలు గ్రామాల్లో పైపులైన్లు లీకేజీతో నీరు కలుషితం అవుతోంది. డైరెక్ట్ పంపింగ్‌లోనూ నీటి కలుషితం తప్పడం లేదు. దీంతో డయేరియా విజృంభిస్తోంది. అనేక మంది ప్రజలు డయేరియా బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారుల్లో చలనం లేదు.

- శుభ్రం చేయని తాగునీటి ట్యాంకులు
- డైరెక్ట్ పంపింగ్‌లోనూ నీటి కలుషితం
- పలుచోట్ల పైపుల లీకేజీలు
- గ్రామాల్లో విజృంభిస్తున్న డయేరియా



పలమనేరు మండలంలోని బండపై ఇండ్లు యానాదుల కాలనీలో నీటిని వడగట్టి పట్టుకుంటున్న స్థానికులు

పలమనేరు: నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో స్కీమ్ బోర్లకు సంబంధించిన పైపులైన్లు దెబ్బతినడంతో అపరిశుభ్రమైన నీరు సరఫరా అవుతోంది. సగం ట్యాంకులను శుభ్రం చేయడమే లేదు. కొందరు సర్పంచులు అక్కరగా ట్యాంకులను కడిగిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో విధి లేని పరిస్థితుల్లో ఆ నీటినే జనం తాగాల్సి వస్తోంది. వర్షాకాలం కాబట్టి కచ్చితంగా ప్రతి నెలా పంచాయతీల పరిధిలో నీటి నాణ్యతా పరీక్షలు చేపట్టాల్సి ఉన్నా పంచాయతీ కార్యదర్శులు ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. చాలాచోట్ల బోర్ల నుంచి డైరెక్ట్ పంపిగ్ ద్వారా నీటిని వదులుతున్నారు. పైపులైన్ మరమ్మతుల కారణంగా డైరెక్ట్ పంపింగ్ నీరు సైతం కలుషితమవుతోంది. నీటి నాణ్యతా పరీక్షలకు గత ప్రభుత్వం అందజేసిన కిట్లు, కెమికల్స్ తదితరాలు పంచాయతీ కార్యాలయాల్లో అటకెక్కాయి. అసలే వర్షాకాలం కావడంతో సమస్య మరింత జఠిలమైయ్యే అవకాశం ఉంది.

నీటి నాణ్యతా పరీక్షలు గాలికి

మండలాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నీటి నాణ్యత పరీక్షలు చేపట్టాల్సి ఉంది. అవగాహన కార్యక్రమాలను సైతం నిర్వహించాలి. ప్రతి పంచాయతీలోనూ ఒక ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తను ఎంపిక చేసి నీటి పరీక్షలు ఎలా నిర్వహించాలో శిక్షణ ఇవ్వాలి. ఇందుకు సంబంధించి కిట్లు, అవసరమైన రసాయనాలు అందజేయాల్సి వుంది. వారు స్కీమ్ బోర్లలోని నీటిలో నైట్రేట్, ఫ్లోరైడ్, డీ సాల్ట్ సాలిడ్స్, క్షార జల సాంద్రత, బీసీజీ-ఎంఆర్ తదితరాలు నిర్వహించాల్సి ఉంది. దీంతోపాటు రక్షిత మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా ఇంత వరకు ఎవరికీ శిక్షణ ఇవ్వలేదు. తాగునీటి నాణ్యత పరీక్షల గురించి పట్టించుకోలేదు. ఫలితంగా గ్రామాల్లో సరఫరా అవుతున్న నీరు కలుషితమై ప్రజలు డయేరియా బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గ్రామాల్లో నీటిని పరీక్షించి మంచి నీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.